క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, సహోపాధ్యాయులు

రేగిడి: బూరాడ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి వేరే పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయు లు ఎస్‌.తిరుపతిరావు, ఎల్‌.గోవిందరావు, టి.అప్పలరాములను సహోపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులను శాలువతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.హెచ్‌ఎం ఎల్‌.ధనలావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడీశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవాలు



పూజలందుకుంటున్న చౌడీశ్వరీదేవి

రాజాం: మున్సిపాలిటీ పరిధి సంతమార్కెట్‌లో ఉన్న చౌడీశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు కల్యాణగౌరీ మల్లికార్జున దేవాంగ సంక్షేమ సంఘం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. నాలుగురోజుల పాటు ఆలయ అర్చకులు హరవిల్లి హరినాథశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాలు ప్రారంభం రోజు గురువారం సాయంత్రం కళాకారుల కోలాటం నడుమ తిరువీధి, లలితా పారాయణం, సహస్రదీపాలంకరణ సేవ ఉంటుందని వెల్లడించారు.

నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలి



విద్యార్థుల వర్క్‌ బుక్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాల ను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్‌ బుక్‌లు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.


విద్యార్థినులకు నేత్ర పరీక్షలు



విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్‌ వసంతరావు

రాజాం సిటీ: జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో గురవాం గ్రామంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. రొటేరి యన్‌, ఆప్తాలమిక్‌ అధికారి సప్పటి వసంతరావు విద్యార్థినులకు కంటి పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. సీజనల్‌గా వచ్చే కండ్ల కలకపై, కంటి వ్యాధులు, సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిను ప్రభావతి జాగృతి ట్రస్టు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, మెడల్స్‌ అందజేశారు. కేజీబీవీ ఎస్‌ఓ పి.సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు జయలక్ష్మి, పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



వైస్‌ ఎంపీపీ నక్క వర్షిణి

రాజాం: వైఎస్సార్‌సీపీ ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని రాజాం వైస్‌ ఎంపీపీ నక్క వర్షిణి ఆరోపించారు. బుధవారం రాజాంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, పాలనను పక్కన పెట్టి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను అక్రమ అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అంతా పక్కా రికార్డులతో ప్రభుత్వ మద్యం దుకాణాలు నడిచాయని, లేని స్కామ్‌ను సృష్టించి మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టుచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈప్రభుత్వం తమ కార్యకర్తలకు మద్యం దుకాణాలు అప్పగించి, అడ్డుగోలుగా మద్యం వ్యాపారం చేస్తోందని ఆరోపించారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- నమ్మించి వంచించడంలో ఆయన సిద్ధ హస్తుడు
- రీకాల్‌ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో శంబంగి



చంద్రబాబు మోసాలను బొబ్బిలిలోని మూడో వార్డులో ఓ మహిళకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బొబ్బిలి: మోసానికి మారుపేరు సీఎం చంద్రబాబునాయుడు అని, ఆయన ప్రజలతో పాటు ప్రభుత్వ అధికారులను, సొంత పార్టీ మనుషులను కూడా మోసం చేసేందుకు వెనుకాడడని, నమ్మించి వంచించడంలో సిద్ధ హస్తుడని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ', 'రీకాల్‌ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని శంబంగి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ నాయకులతో కలిసి వార్డులోని ఇంటింటికీ వెళ్లి గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు అండ్‌-కో ఇచ్చిన హామీల పత్రాన్ని, ఇచ్చిన బాండ్లను శంబంగి ప్రజలకు చూపించారు. ఈ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందా..? మీ వార్డులో ఉన్న ఒక్కో కుటుంబానికీ రూ.1,05,000ల చొప్పున ఈ ఏడాది అందాయా అని ప్రశ్నించారు. మహిళలంతా ముక్తకంఠంతో చంద్రబాబు ఇచ్చిన ఏ హామీలూ అమలు కాలేదని ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన డీబీటీ పథకాలే మాకు అండగా నిలిచాయని కూడబలికారు. అమ్మఒడి పేరుతో గత ప్రభుత్వం మహిళల ఖాతాల్లో రూ.13,000 జమ చేస్తే చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాన్ని మేమూ అమలు చేస్తామని చెప్పి తల్లికి వందనం పేరుతో రూ.8 నుంచి 9 వేలను మాత్రమే జమ చేస్తోందని శంబంగి అన్నారు. అలాగే ఆడబిడ్డ నిధి పథకం కింద 18 నుంచి 59 ఏళ్ల లోపున్న ప్రతీ మహిళ ఖాతాలో నెల నెలా రూ.1500 జమ చేసి ఆదుకుంటామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మంత్రుల నోటివెంట రాష్ట్రాన్ని అమ్మాలనే వ్యాఖ్యలు చేయిస్తోందని చెప్పారు. దీంతో మహిళలు ఈసారి ఎన్నికల్లో కచ్చితంగా జగన్‌ బాబే వస్తాడని అన్నారు. పలు దుకాణాలు, కూరగాయలు, పండ్లు అమ్మే మహిళా వర్తకుల వద్దకు వెళ్లిన శంబంగి వారికి మేనిఫెస్టోతో చంద్రబాబు ఎలా మాయ చేశారో వివరించారు. మహిళా వర్తకులు మాట్లాడుతూ మాకు గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.18,500 జమయ్యాయని, జగనన్న తోడు కింద రూ.10వేల రుణం వచ్చిందని, అమ్మ ఒడి పథకంలో రూ.13వేలు వచ్చాయని, దర్జీలకు, ఆటో వాలాలకు రూ.10వేల చొప్పున అందాయని వారే స్వయంగా వివరించడం విశేషం. అనంతరం కార్యక్రమం ముగింపుసందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మాజీ మున్సిపల్‌ ఛైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్‌.వి.మురళీకృష్ణారావు, మున్సిపల్‌ వైస్‌ ఛైర్‌పర్సన్‌ గొలగాని రమాదేవి,నాయకులు తూముల రాణి, బి.సురేష్‌, మురళి, మామిడి చంటి, వంగపండు శ్రీరాములునాయుడు, చంద్రపూడి రమేష్‌, ఎస్‌.బాబు, పాలవలస ఉమా శంకర్‌, పలువురు కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.



పండ్ల వ్యాపారం చేస్తున్న మహిళకు చంద్రబాబు హామీలను గుర్తు చేస్తున్న శంబంగి

వ్యాపారులకు నోటీసులు



దుకాణానికి నోటీసులు అంటిస్తున్న ఈఓ మాధవరావు

రాజాం: పట్టణంలోని డోలపేట వద్ద ఉన్న ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి దేవాలయాలకు చెందిన భూములను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్న పలువురికి దేవదాయ ధర్మాదాయశాఖ రాజాం ఈఓ బి.వి.మాధవరావు బుధవారం నోటీసులు జారీచేశారు. ఈనెల 22న దేవదాయశాఖ ఏసీ కె.శిరీష ఈ ఆక్రమణలు పరిశీలించడంతో పాటు వారం రోజుల గడువుతో పలువురి వ్యాపారులకు నోటీసులు ఇవ్వడం, పలు షాపులు సీజ్‌ చేసిన విషయం పాఠకులకు విధితమే. అప్పట్లో అందుబాటులో లేని వ్యాపారులకు, షాపుల యజమానులకు ఈఓ బుధవారం నోటీసులు అందించడంతో పాటు ఆయా షాపుల వద్ద నోటీసులు అంటించారు. వ్యాపారులు ముందుగా మేల్కోవాలని, ఈ ఆక్రమణల్లో వ్యాపారాలు చేస్తే వారు కూడా ఆక్రమణదారుల పరిధిలోకి వచ్చి చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

జీఓ 30పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆశయ్య

రాజాం సిటీ: జీఓ 30పై ప్రజలకు అవగాహన కల్పించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు.స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించా రు. జీఓ 30 ప్రాప్తికి గ్రామాల్లో 2019 కంటే ముందు ఎటువంటి వివాదాలు లేని ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటుచేసుకున్నవారిని గుర్తించాలని అన్నారు. అటువంటి వారిలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. రాజాంకు సంబంధించి 17 దరఖాస్తులు రాగా వీటిలో అర్బన్‌కు సంబంధించి మూడు, రూరల్‌కు సంబంధించి ఒక దరఖాస్తుదారును అర్హులుగా గుర్తించామని తహసీల్దార్‌ రాజశేఖర్‌ తెలిపారు. సూపరింటెండెంట్‌ ప్రకాష్‌రాజ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామప్పలనాయుడు, రేగిడి, వంగర, సంతకవిటి తహసీల్దార్‌లు కృష్ణలత, రమణారావు, సుదర్శనరావు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా భూములు లాక్కుంటున్నారు..



కాకర్లవలసలో గిరిజన రైతులకు ఇచ్చిన ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ పట్టాలను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ అజు రఫీజాన్‌

రామభద్రపురం: దశాబ్దాలుగా, తాత,ముత్తాతల నుంచి వంశపారంపర్యంగా తాము సాగు చేసుకుంటున్న భూములను ఏపీఐఐసీ అధికారులు దౌర్జన్యంగా లాక్కుం టున్నారని, తమకు న్యాయం చేయాలని మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస,కారేడువలస గ్రామాల గిరిజన రైతులు కోరుతున్నారు. కాకర్లవలసలో మిర్తివలస సర్పంచ్‌ మజ్జి రాంబాబు, సీపీఐ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తమకు ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు ఆభూములనే ఎంఎస్‌ఎంఈ పార్కు కోసమని లాక్కోవడం సమంజసం కాదని అన్నారు. రైతులెవరికీ చెప్పకుండా ఆ భూముల్లో ఉన్న మామిడి, జీడితోటలు, మొక్కజొన్న,పత్తి పంటలను జేసీబీతో ధ్వంసం చేసి, రోడ్ల కోసం తవ్వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ భూములు తీసుకుంటే తాము పిల్లలతో రోడ్డునపడతామని కన్నీరు కార్చారు. గిరిజనులం, వారికి అడిగే దిక్కు లేదనే ఉద్దేశంతోనే ఏపీఐఐసీ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. చావనైనా చస్తాం కాని భూములు వదులుకోమని అన్నారు. గిరిజను లు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకుని తహసీల్దార్‌ అజూ రఫీజాన్‌, సీఐ కె.నారాయణరావు పోలీస్‌ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. జేసీబీతో తవ్వేసిన పంటలను పరిశీలిం చారు.ఏపీఐఐసీ అధికారులను పిలిచి ఆ భూములు ఎవరిపేరున ఉన్నాయనేది అరికార్డులు పరిశీలించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారమయ్యేంతవరకు ఎలాంటి తవ్వకాలు, చదును చేసే పనులు చేపట్టవద్దని జేసీబీ ఆపరేటర్‌ను ఆదేశించారు. ఎస్‌ఐ తారకేశ్వర రావు,మండల సర్వేయర్‌ వి.సాయికుమార్‌,కొట్టక్కి వీఆర్‌ఓ మహేష్‌ ,వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ పత్రం.. మోసానికి గ్యారెంటీ పత్రం

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలి
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్‌, మాజీ ఎంపీ బెల్లాన, రాజేష్‌



'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్‌, మాజీ ఎంపీ బెల్లాన, తలే రాజేష్‌

రాజాం:

ఎన్నికల ముందు సూపర్‌ సిక్స్‌ హామీలతో చంద్రబాబు ష్యూరిటీ పత్రాలు ఇచ్చారని, ఇప్పుడవి కూటమి చేసిన మోసానికి గ్యారెంటీ పత్రాలుగా మారాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ ఎద్దేవా చేశారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని అంతకాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ విక్రాంత్‌, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్‌, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ తలే రాజేష్‌ అతిథులుగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్‌ మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికుడిలా పనిచే యాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం లేనిపోని హామీలు, బాండ్లు ఇచ్చి ప్రజలను మోసగించిందని, ఈ మోసాలపై మదనపడుతున్న ప్రజలకు మనం అండగా నిలబడాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు, ఇప్పుడు వంచించిన వైనాన్ని వివరించాలని కోరారు. 2014లో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రైతులను, మహిళలను మోసగించారని, 2024లో సూపర్‌ సిక్స్‌తో ప్రజల గొంతుకోశారని ఆరోపించారు. చంద్రబాబు తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుద్వారా కూటమికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

చేతకావడం లేదు..

వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్‌, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడం సీఎం చంద్రబాబుకు చేతకావడం లేదని అన్నారు. చంద్రబాబు వందల హామీలు ఇచ్చారని, వాటన్నింటికీ తనదే బాధ్యత అంటూ అర్ధరాత్రి కూడా ప్రచారాలు చేసి ప్రజలను మోసగించారని మండిపడ్డారు. ఇప్పుడు సుపరిపాలన పేరుతో గ్రామాల్లోకి వెళుతున్న టీడీపీ నాయకులను ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం..

రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ తలే రాజేష్‌ మాట్లాడుతూ 'బాబుష్యూరిటీ' పేరుతో ఇచ్చిన హామీలను రీకాల్‌ చేయడంతో పాటు ఇప్పుడు జగన్‌ మోహన్‌రెడ్డి సీఎంగా ఉండి ఉంటే ఎంత మేలు జరిగి ఉండేదో ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలనలో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది టీడీపీ కార్యకర్తలు మాఫియాగా మారారని, ప్రభుత్వ భూములు, చెరువులు, స్థలాలను ఆక్రమించేస్తున్నారని ఆరోపించారు. పోలీస్‌ యంత్రాంగం ఒక వైపు కొమ్ముకాస్తోందని, రెడ్‌ బుక్‌ రాజ్యాంగాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వీరంతా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల వింగ్‌ రాజాం అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, పార్టీ రాజాం పట్టణ, రూరల్‌ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీబండి నర్సింహులు, వైస్‌ ఎంపీపీలు యాలాల వెంకటేష్‌, నక్క వర్షిణి, అంతకాపల్లి ఎంపీటీసీ బొరోతు కాంతారావు, ఆర్టీఐ వింగ్‌ జిల్లా కార్యదర్శి జడ్డు జగదీష్‌, పార్టీ కల్చరల్‌వింగ్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ నరేంద్ర, వంజరాపు విజయ్‌కుమార్‌, కామోదుల శ్రీరంగంనాయుడు, కోనారి అప్పారావు పాల్గొన్నారు.

అన్నింటా ప్రభుత్వం విఫలం



విలేకరులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు

రేగిడి: కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి చేయడంలో, శాంతి భద్రతలు కాపాడడంతో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, ఆపార్టీ మండల కన్వీనర్‌ వావిలపల్లి జగన్‌మోహనరావు ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటి పోయిందని, ఇంత వరకూ ఎన్నికల హామీలు అమలు చేయకపోవడమే కాకుండా ఎలాంటి అభివృద్ధి చేయకపోవడం దారుణమన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ రూపొందించి, చెప్పిన తేదీకి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేసేశామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి సాగునీటి కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో ఖరీఫ్‌ వరి పంటకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఎరువులు అందజేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

నేడు తాటిపాడులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మండలంలోని తాటిపాడు గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు అచ్చెన్నాయుడు, జగన్‌మోహనరావు తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ తలే రాజేష్‌, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీకార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్‌ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ రాజాం నియోజకవర్గ మేధావివర్గం అధ్యక్షుడు కెల్ల మన్మథరావు పాల్గొన్నారు.

నివాళి



లక్ష్మనాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చింతల లక్ష్మనాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మనాయుడి భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి భార్య సత్తెమ్మను, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పరామర్శ



వెంకటరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్‌ రాజేష్‌

రాజాం: వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్‌ జిల్లా అధ్యక్షుడు గంధవరపు హేమంత్‌ తాత, వైఎస్సార్‌ సీపీ నేత, రచయిత వెంకటరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్‌ తలే రాజేష్‌ బుధవారం రాజాం పట్టణంలోని తెలగవీధిలో హేమంత్‌ నివా సానికి వెళ్లి పరామర్శించారు. వెంకటరావు మృతికి కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, పార్టీ జిల్లా కల్చరల్‌ వింగ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ నరేంద్ర, సలాది సతీష్‌ ,తదితరులు ఉన్నారు.

సాగునీటి వనరుల గణనపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఏఎస్‌ఓ సురేష్‌

బొబ్బిలిరూరల్‌: సాగునీటి వనరుల గణనపై స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం లో మండల వీఆర్‌ఓలకు డీఎస్‌ఓ భానుమూర్తి, ఏఎస్‌ఓ యు.సురేష్‌ బుధవారం శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులను పరిశీలించిన తహసీల్దార్‌ ఎం.శ్రీను మాట్లాడుతూ మండలంలో చిన్న, మధ్యతరహా చెరువులు, బందలు, ఇతర సాగునీటి వనరులను, వాటి విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను లెక్కించాలని ఆదేశించారు.గ్రామాల్లో వీఆర్‌ఓలు పట్టణాల్లో మున్సిపల్‌ సిబ్బంది ఎన్యూమరేటర్లగా వ్యవహరించి ఈ ప్రక్రియను నిర్ధేశిత కాలంలో పూర్తిచేయాలని చెప్పారు. చెరువుల విస్తీర్ణం, ఆయకట్టు గతంలో ఎంత ఉంది, ప్రస్తుతం ఎంత ఉందన్న వివరాలను అందుబా టులో ఉంచుకోవాలన్నారు. పూడిక పోయిన, ఆక్రమణలకు గురైన సాగునీటి వనరుల గుర్తింపులో శ్రద్ధవహించాలని సూచించారు.

సంక్షిప్తంగా...

స్వాతంత్య్ర సమరయోధులను మననం చేసుకోవాలి



బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్‌: స్వాతంత్య్రం కోసం పోరాడిన సమరయోధులు ఎప్పటికీ ఆదర్శప్రాయులేనని ఉపాధ్యాయులు కొనియా డారు.మండలంలోని పక్కి గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్‌ తిలక్‌, చంద్రశేఖర్‌ ఆజాద్‌ల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం జె.వి.రాజు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో సదుపాయాల పరిశీలన

రాజాం:గడిముడిదాం ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు శాతాన్ని ఎంఈఓ యాగాటి దుర్గారావు బుధవారం పరిశీలించారు.ఈ పాఠశాలను మోడల్‌ స్కూల్‌గా మార్చుతున్నామని ఎంఈఓ చెప్పారు. ఈమేరకు పాఠశాలలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నామని తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం పైడిరాజు,సీఆర్‌ఎంటీ రాచయ్య ఉన్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి

సంతకవిటి: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని యూటీఎఫ్‌ మండల అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసం అన్నారు. మండల యూటీఎఫ్‌ శాఖ బుధవారం పలు పాఠశాలలను సందర్శించి యూటీఎఫ్‌ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధన సమయంలో ఉన్నతాధికారుల నుంచి అర్జెంట్‌ సమాచారం పేరిట రోజూ డేటా అప్లోడింగ్‌ చేయమని ఆదేశాలు వస్తున్నాయని చెప్పారు. ఈ విధానాన్ని ఖండించారు. కార్యక్రమంలో సిరిపురం జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.వెంకటరావు, యూటీఎఫ్‌ కౌన్సిల్‌ సభ్యులు శాసపు బాబూరావునాయుడు, నాయకులు వి.సురేష్‌, వి.రాజారావు, జి.పాపారావు, ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియర్‌ సిటిజన్‌ సర్వే పరిశీలన

రాజాం: గ్రామాల్లో సీనియర్‌ సిటిజన్‌ సర్వే సక్రమంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంతకాపల్లి, పొగిరి, మారేడుబాక గ్రామాల్లో సిటిజన్‌ సర్వే ఫీడ్‌ బ్యాక్‌ను బుధవారం పరిశీలించారు. పలువురి ఇళ్లకు వెళ్లి గ్రామాల్లో మౌలికవసతులపై ఆరాతీశారు. గ్రామాల్లో చెత్తసేకరణ తో పాటు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఆరాతీశారు. ఆయన వెంట పంచాయతీకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

తెర్లాం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌-2లో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ఈశ్వరమ్మ బుధవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో ప్రీస్కూల్‌ పిల్లలు, కార్యకర్త, హెల్పర్‌ హాజరు, వివిధ రికార్డులు, స్టాక్‌, పిల్లల బరువులు, ఎత్తులను పరిశీలించారు. కేంద్రంలోని ప్రీస్కూల్‌ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్త జి.లక్ష్మికి సూచించారు.